

# అమెరి'కాకమ్మ'కథలు

వంగూరి చిట్టెన్ రాజు



## విరాళాల వేట

అమెరికాకమ్మ కథలు- 6

**పవిత్ర భారత దేశంలో** చాలా మంది గొప్పవాళ్ళున్నారు. అలాంటి ఒక పేద్ద, ఫేమస్ గొప్పాయనకి అమెరికా రావడం పేద్ద ఇష్టం లేదు. మన టెలెగూ ఎన్నారైలని నమ్మడానికి వీల్లేదూ, పైగా వెధవ అమెరికాలో అడుగుపెట్టగానే ప్రతీ ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీలోనూ బూట్లు, చొక్కాలూ విప్పేసి నగ్నంగా నుంచోడం కూడా నాకు ఇష్టంలేదూ అని ఆయన నాతో చాలా సార్లు తన అభిప్రాయం వెలిబుచ్చారు. అంచేత ఆయన ఎలాగా నో, నో, నేను చస్తే అమెరికా రానూ అంటాడు కదా అని ఒక సారి ఆయన్ని - ఆప్యాయంగా అమెరికా రండి సార్ అని ఆహ్వానించాను. నా ప్రాణాలకి, ఏ కళనున్నాడో నువ్వు పిలిస్తే ఎందుకు రానంటానయ్యా అని ఠకీ మని ఒప్పేసుకున్నాడు.

అమెరికాలో జట్కా సంఘం, తంటా సంఘం, ఈ మధ్యనే వెలిసిన కడ్డీ సంఘమూ మొదలైన వారిలాగ "మేము ఆహ్వానం మాత్రమే పంపిస్తామూ, మీ ఖర్చులు మీరే పెట్టుకుని, మమల్ని చంపకుండా ఇక్కడ కూడా మీ బస, తిండి మొదలైన ఏర్పాట్లు మీరే చూసుకుని తరించండి " అనే పద్ధతిలో ఇండియాలో అందరికీ పెళ్ళి పత్రికలు పంచిపెట్టేసినట్టు ఆహ్వాన పత్రికలు పంచిపెట్టడం నాకు చేత కాదు కాబట్టి ఇక తప్పదు కదా అని దేశం మీద పడ్డాను. ఎందుకంటే నా జేబులో ఎప్పుడూ కాణీకూడా ఉండదు. పోనీ కొనడానికి ఇదేమీ కాకినాడా టూ గైగోలుపాడు బస్సు టిక్కెట్టు కాదు కదా! విమానం టిక్కెట్టూ, ఆయన దర్జాగా రావడానికి షోకుగా ఉండే తోలుపెట్టే కావాలి కదా! ఇటువంటి విషయాలలో నా నేను గమనించినది ఏమిటంటే చాలా మంది ఇండియాలో కాకినాడా టూ గైగోలుపాడూ విమానంలో వెళ్ళినా, వాళ్ళు మటుకు బొమ్మనా బ్రదర్స్ వారి దగ్గర ఒక చెడ్డీ కొని బొమ్మనా వాళ్ళిచ్చే గోనె సంచులు అర డజను లాగేసి ..వాటిని షాపర్స్ బేగ్ అంటారుట...ఆ బేగుల్లోనే అన్నీ సద్దేసుకుంటారు. అదే అమెరికా అనగానే, రెండు వేల రూపాయల సూట్ కేసి కొనేసి, ఆ ఖర్చులు ఆహ్వాన పత్రిక పంపించిన వాడి నెత్తిన రుద్దేస్తారు. అదే ఆ మహానుభావుడు పాటగాడో, రచయితో అయితే వాళ్ళు అమెరికాలో అమ్ముదల్చుకున్న సీడీలూ, పుస్తకాలూ వగైరా ఖర్చు కూడా మనకే. అదే స్వామీజీలైతే వారు తెచ్చుకునే బూడిద బస్తా కూడా భక్తుల ఎకౌంట్‌లో పడుతుంది.

ఈ పెద్దాయన విషయంలో లెక్కలు వేస్తే గుండె గుభేలు మని, విరాళాల వేటలో అమెరికాయే కాక కెనడా కూడా ఒక ట్రిప్ వెయ్యాలేమో అనిపించింది. కానీ నాకొక దురలవాటు ఉంది. నేను ఎవరినీ ఫోన్ చేసి కానీ, వాల్ మార్ట్‌లో చవగ్గా , సేల్లో ...యస్.... ఒక చెడ్డీ కొంటే రెండు ఫ్రీ అనే బాపతు లో కనపడ్డ మిలియనియర్‌ని కానీ నోరు విడిచి నయా పైసా చందా అడగను. ఎటొచ్చీ "బాబూ, అమ్మా, ధర్మం చెయ్యండి" అని తెలిసిన వారికీ, తెలియని వారికీ అందరికీ లేఖలూ, విద్యుల్లేఖలూ రాసి, విరాళములు పంపుటకు పది రోజులు గడువిస్తాను. ఆ పది రోజులూ నేను మా ఇంట్లో దేవుడి గదిలో కూచుని తపస్సు చేస్తాను. సాధారణంగా నాకు తెలిసిన వాళ్ళందరూ ఆ ఉత్తరాలని చెత్త బుట్టలో పారేస్తారు. తెలియని అమాయకులు నా మీద జాలి పడి తృణామో, పణమో పంపిస్తారు. నాకు పబ్బం గడుస్తుంది.

ఈ పెద్దాయన కేసులో కూడా అదే పద్ధతి అనుసరించి, నేను దేవుడి గదిలో సజీవ సమాధిలో ఉండగా, తొమ్మిదో రోజు నాకు బొత్తిగా తెలియని ఒకాయన వెయ్యి డాలర్లు పంపించారు. అఫ్ కోర్స్, కడ్డీ సంఘానికి ఆయన ప్రెసిడెంట్ పదవికి పోటీ చేస్తున్నాడని ఆ తరవాత తెలిసిందనుకోండి. అది వేరే సంగతి. ఎక్కడో, ఏదో లంకె లేకపోతే సాహిత్యానికి, సభలకీ చందా ఎవరిస్తారు చెప్పండి.

సరిగ్గా చెక్కును నేను ఎంతో ఆప్యాయంగా, ఇది కలయా, నిజమా లాంటి ఫీలింగుతో చూస్తూ ఉండగా ఇండియానుంచి పెద్దాయన ఫోన్ చేశాడు వీసా పేపర్లు అందాయా అని చెప్పడానికి. ఆ తన్మయత్వంలో నేను ఈ శుభవార్త ..అనగా ఎవరో ఒక బలి చక్రవర్తి గారు అక్షరాలా వెయ్యి కుడుములు చందా ఇచ్చారు అని చెప్పి చచ్చాను. ఈ చచ్చుటకు కారణమేమనగా "నేను ఆ మాట చెప్పగానే ఆయన స్టోను పూర్తిగా మారిపోయి "నీకేమన్నా బుద్ధుందా?" అని ఎగిరిపడ్డాడు. నాకు ఉండవలసిన బుద్ధి, లేదా బుద్ధి మాంద్యం మీద ఈయనకు ఇప్పుడు అనుమానం ఎందుకు వచ్చిందీ అని నాకు అనుమానం వచ్చింది.

"ఏమో తెలియదు సార్. నా బుర్రలో సరుకు నాణ్యత ఎలా ఉందో పరీక్షించడానికి నేను డా. జెతానంద్ గారి దగ్గరకి వెళ్ళి చాలా రోజులయింది" అన్నాను.

"ఎవడా జెతానంద్" అని మళ్ళీ ఎగిరిపడ్డాడు సదరు పెద్దాయన.

నాకు తెలియక అడుగుతానూ, మేము నా బుద్ధి తక్కువా, ఎక్కువాలాంటి ప్రగాఢమైన విషయాలు చర్చించుకుంటునప్పుడు, ఈ డా. జెతానంద్ ఎవరైతే ఆయనకెందుకు చెప్పండి. ఆ మాటకొస్తే నాకూ ఈ జెతానంద్ ఎవరో తెలియదు. ఎప్పుడో హైదరాబాదు వెళ్ళినప్పుడు గోడల మీదా, గూడ్స్ బండి పెట్టెలమీదా ఆయన గురించి చదివాను. ఈ పెద్దాయన్ని ఇంప్రెస్ చేయుటకూ, పెద్దాయన మనసు పక్క దారి పట్టించుటకూ ఈ జెతానంద్ ప్లాన్ వేశాను. ఎంతయినా బ్రిలియంట్ ఫెలోని కదా!

నా దురాలోచన పసిగట్టేసి, " చందాలేసుకుని వెధవ ఆహ్వానంతో నన్ను అమెరికా రప్పిస్తావా? నేనేమన్నా యాయవారం బిచ్చగాణ్ణి అని అనుకున్నావా?" అని మళ్ళీ ఎగిరిపడ్డాడు పెద్దాయన.

ఆ క్షణాన్న నాకు ఆయన ప్రవచనంలో వ్యాకరణదోషాలు కనపడ్డాయి. ఆ "వెధవ" అనే విశ్లేషణం ఆ గొప్ప సాహితీవేత్త గారు నేను పంపించిన ఆహ్వానానికి అన్వయించా రా, లేక ఆహ్వానాన్ని పంపించిన నాకు వ్యక్తిగతంగా అన్వయిస్తుందా అనేదే నాకు అర్థం అవలేదు. అందులో ఏది సరి అయినది అయినా, ఈక్వల్‌గా డేమేజింగ్‌గా ఉన్నాయి కానీ, అంతకుమించిన కొంపలు మునిగిపోయే అవకాశం కూడా నాకు ఆ క్షణాన్నే ప్రస్ఫుటంగా, స్పష్టంగా కనపడింది. వెంటనే ప్లేటు ఫిరాయించాను. నా కొంప ఎందుకు మునుగుతుందీ అంటే....ఇప్పుడు కోపం తెచ్చుకుని సాహితీవేత్త నిజంగానే అమెరికా ప్రయాణం కేన్సిల్ చేసిపారేశాడనుకోండి. ఆ బలి చక్రవర్తి గారు ఊరుకుంటాడా? ఈ పెద్దాయన వస్తున్నాడు కదా అని ఇచ్చిన వెయ్యి కుడుముములు వెనక్కి తిరిగి ఇచ్చెయ్ అని నా

ప్రాణం తీస్తాడు కదా! అప్పటికే ఆ చెక్కు నేను బేంకులో వేయుటా, వెనువెంటనే ఖర్చుపెట్టుట జరిగిపోతాయి కదా! ఆ మాటకొస్తే ఎవరి డబ్బు అయినా , ఏ రకమైన డబ్బు అయినా కూడా, మన బేంకులో పడ్డాక మళ్ళీ వారి ధనం వారికిచ్చేస్తే మన తెలుగు జాతికే అవమానం కదా! తెలుగు జాతిని ఆ అవమానం నుంచి తప్పించడానికే నేను ప్లేటు ఫిరాయించాను.

ఆ ప్లేటు పేరు వికలాంగులు. " సార్, ఆ చందా మీరు అమెరికా రావడం కోసం బొత్తిగా కాదు సార్. ఉత్తుత్తినే అన్నాను. అది హైదరాబాదులోని మా వికలాంగుల సంస్థకి డా. బలి గారు హృదయాంతరాళలో ద్రవించి, స్పందించి ఇచ్చిన విరాళ రాజం" అని నాకొచ్చిన తెలుగు అంతా వాడి, ఆయనకి నొక్కి వక్కాణించి, ఆ గండం నుంచి బయట పడ్డాను.

ఎప్పుడో కొంత జరిగి, కొంత జరగని ఈ సంఘటన అంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే, గత మే నెల మొదటి వారం నుంచీ రాబోయే జూలై రెండో వారం దాకా అమెరికాలో ఘంటసాల ఆరాధనోత్సవాలు జరుపుతూ, హైదరాబాదులోని వేగేశ్న ఫౌండేషన్ అనే వికలాంగుల సంక్షేమ సంస్థకి మళ్ళీ విరాళాలు పోగుచెయ్యడానికి అమెరికాలో ముప్ఫై ఊళ్ళు తిరుగుతున్నాను. ఈ సారి నా అభిమాన గాయని విజయలక్ష్మి , మొదటి సారి అతని పాట వినగానే నా అభిమాన గాయకుడు అయిన చంద్ర తేజ, వేగేశ్న ఫౌండేషన్ మరియు వంశీ ఇంటర్నేషనల్ సంస్థాపకులు వంశీ రామరాజు గార్లని అన్ని ఊళ్ళకీ తీసుకెడుతూ నా "చోదక స్వమాట్" ఉద్యోగం వెలగబెడుతున్నాను. ఈ ఏడు వేగేశ్న ఫౌండేషన్ వారి 20వ వార్షికోత్సవం.

ఈ అమెరికా పర్యటన ప్రణాళిక రూపొందాక "ఇదిగో, ప్రేయసీ, వచ్చే వారం నుంచీ చందాల వేటకి బయలుదేరుతున్నాను" అని వివరాలు ఎంత వరకూ చెప్పాలో అంత వరకే మా క్వీన్ విక్టోరియాతో విన్నవించాను. ఇక్కడ గమనించవలసిన విషయాలు రెండున్నాయి. ఒకటేమో నేను ఆవిడని "ప్రేయసీ" అని సంబోధించడం. నేను ఖచ్చితంగా అడ్డమైన తిట్లూ తినే అవకాశం ఉన్నప్పుడల్లా మా మహారాణీ గారిని ప్రేయసీ, రంభా, తిలోత్తమా వగైరా పేర్లతో, ఎందుకైనా మంచిదని కించిత్తు దూరం నుంచే నాగేశ్వర రావు-సావిత్రి టైపులో పలకరిస్తాను. రెండవది అటువంటి సమయాలలో నేను విషయాన్ని చెప్పను. "విన్నవిస్తాను". అంటే "ఏం కూర వండావూ?,"పెరుగు ఇంత పుల్లగా చేశావేం?" "ఇదేమిటీ క్రెడిట్ కార్డులో ఈ తొంభై డాలర్ల తొంభై తొమ్మిది ఖర్చు దేనికి పెట్టావూ?" లాంటి డైలాగులు చెప్పే నిస్సహాయ పరిస్థితిలోనూ "వచ్చే రెండు నెలలూ నీకు కనపడను సుమా" అనే శుభవార్త చెప్పడంలోనూ స్వోను మార్పు ఉండాలి కదా! అందుకే ఈ "విన్నవించే" స్ట్రేటజీ వాడుతూ ఉంటాను.

ఈ సారి నేను అనుకున్న రియాక్షన్ రాకుండా, అనేక వేల నిట్టూర్పుల మధ్య "ఓహో, మళ్ళీ 'ఛండాల రాజు' అవుతున్నావన మాట" అన్నారు క్వీన్ విక్టోరియా గారు.

"ఛండాల రాజు ఏమిటీ?" అన్నాను టాపిక్ అర్థం అవక, నా స్వోను ఏ రకమైన స్వోను వలె మార్చవలెనో తెలియక.

"అదేలే నిన్ను ప్రపంచం అంతా అలాగేగా పిలిచేదీ?"

"అంత ఛండాలం గా ఏమీ పిలవరు. ఆ మాట కొస్తే చందాల రాజు అని పిలుస్తారు" అన్నాను కొంచెం పౌరుషంగా.

"అదేనోయ్ వెర్రి మొహమా, చందాల రాజు అనే తెలుగు మాటని ఇంగ్లీషులో రాసి చదువుకో. CHANDALA RAJU అనగా ఛండాల రాజే కదా!"

క్షణంలో అసంకల్ప ప్రతీకార చర్య అనే సైంటిఫిక్ సిద్ధాంత ప్రభావం వలన అప్పటికప్పుడు మరింత తెల్లబోయిన నా మొహాన్ని ఒరిగినల్ మొహంలా ఎలా తెచ్చుకోవాలా అని ఆలోచిస్తూండగా, నాకు ఏదో కొత్త విద్యుల్లేఖ..అంటే ఈ మెయిల్ వచ్చినట్టు నా ల్యాపు టాపు ఠంగున మోగింది.

"ప్రపంచంలో ఉన్న Top Ten Most Influential తెలుగు ప్రవాసాంధ్రులలో మీరు ఎన్నిక కాబడ్డారు. కాబట్టి ఈ విషయం మీ ఆవిడతోనూ, మిగిలిన ప్రపంచం అంతా బట్వాడా చేసి, మా వెబ్ సైటు కూడా అందరికీ తెలిసేలా చెయ్యండి అని ఒకానొక తెలుగు వెబ్ సైట్ వారి సందేశం ఈ మెయిల్ సారాంశం. ఆ క్షణంలో నేను ఇరుక్కున్న అనేక సమస్యలనుంచి తప్పించుకొనుటకూ, క్వీన్ విక్టోరియాకి ఈ శుభ వార్త చెప్పి సుసంపన్నం చేసుకోడానికీ, అంతే కాక ఆ వెబ్ సైట్ వారు ఆదేశించిన విధంగా ఒక వేళ నేను మా - ఆవిడకి వార్త అర్జంటుగా చెప్పకపోతే సదరు ఎవార్డును వారు వెనక్కి లాగేసుకుంటారేమో అని భయం వేసి, ఈ ఈ మెయిల్ సారాంశాన్ని మా క్వీన్ గారికి...."విన్నవించాను".

"వాళ్ళకి ఎంత చందా ఇచ్చావ్, రాజా? " ప్రశ్నించింది మహారాణి. ఆవిడ మేధాశక్తికి నా జోహార్లు.

♣

